# మల్లీశ్వరి మాయమైంది

**మ**ల్లీశ్వరి మహాపతివ్రత.

కాదంటే కళ్లు పోతాయి.

అయినా లోకులు కాకుల్లాంటి వాళ్ళు గనక ఏవో కారుకూతలు కూస్తూనే వుంటారు. అవన్నీ మనం పట్టించుకోకూడదు. మల్లీశ్వరి మొగుడు మాధవరావు వట్టి వెర్రి కుట్టె అనీ, అతగాడి కళ్ళకీ, చెవులకీ గంతలు కట్టేసి, వోమూల కూచోబెట్టి మల్లీశ్వరి తన ఆటలు తాను సాగించుకుంటోందనీ, పరాయి మగాళ్ళతో కులుకుతోందనీ కుళ్ళుకూతలు కూస్తున్నారుగాని, మల్లీశ్వరి అటువంటి మనిషి కాదు. ఆమె నాకు బాగా తెలుసు. మల్లీశ్వరి మొగుడు మాధవరావు అంతకుముందే తెలుసు. 'మల్లీశ్వరి మామూలు మనిషి కాదు... దేవత' – అని మాధవరావే గతంలో అనేకమార్లు నాతో అన్నాడు. కాలేజీ రోజుల్లో ఈ మాటలే కాస్త మార్చి 'మల్లీశ్వరి మామూలు మనిషి కాదురా.... దేవకన్య!' అనేవాడు. అయితే ఆ మాట మాధవరావొక్కడే కాదు, కాలేజి కుర్రాళ్ళలో కనీసం సగం మంది అనేవారు.

మాధవరావు, మల్లీశ్వరీ కాలేజీలో నా క్లాస్ మేట్స్.

★★★

ఫీజులన్నీ కట్టాలేగాని ఇంటరైనా, డిగ్రీ కోర్సులైనా ఎంచక్కా ఎన్నేళ్ళయినా చదువుకునే సౌకర్యం వుండేది మా కాలేజీలో. ఆ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుంటూ రెండేళ్ళ ఇంటర్ మూడేళ్ళలోనూ, మూడేళ్ళ డిగ్రీ కోర్సు నాలుగేళ్ళలోనూ విజయవంతంగా పూర్తి చేశాను. అత్తెసరు మార్కులతో అతికష్టమ్మీద ఇంటర్ పాసై, ఇంకెక్కడా సీటు దొరక్క బి.కామ్‌లో చేరి, మొదటి సంవత్సరం పరీక్షలు రాయకుండా, మరుసటి ఏడాది మళ్ళీ అదే చదువుతున్నప్పుడు, మాధవరావు, మల్లీశ్వరి నా క్లాసులో చేరారు. మాధవరావు నా క్లాస్ మేటే కాకుండా బెంచ్ మేట్ కూడా అయ్యాడు. కొద్ది రోజుల్లోనే నాకు మంచి స్నేహితుడయ్యాడు. ఇక మల్లీశ్వరి వచ్చీ రావటంతోనే మా క్లాస్‌లోనే కాదు – కాలేజి అంతటా మెరుపులు మెరిపించటం ప్రారంభించింది.

మల్లీశ్వరికి అప్పటికి పదిహేడేళ్ళో, పద్దెనిమిదేళ్ళో వుంటాయి. చూడగానే కళ్ళు మిరుమిట్లు గొలిపే అందం కాదు ఆమెది. చూసినకొద్దీ ఒకసారి కంటే మరోసారి మరింత అందంగా, ఆకర్షణీయంగా అనిపించి, ఆపైన అసలు మరవలేకుండా చేసే మహత్తు ఏదో ఆమె రూపంలో వుంది. ఈ అందం, ఆకర్షణా కేవలం ఆమె శరీరాకృతికే పరిమితం కాలేదు. ఆమె చూపుల్లో, మాటల్లో మగాడికి మత్తెక్కించే మాయ ఏదో వుంది. అందుకే కాలేజీ కుర్రాళ్ళు చాలామంది ఆమెను 'సెక్సీ బ్యూటీ' అనీ, 'సెక్సీ క్వీన్' అనీ రకరకాలుగా పిలిచేవారు. రకరకాలుగా ఆమె అందాన్ని వర్ణించేవారు.

ఏదో విధంగా మల్లీశ్వరి దృష్టిలో పడాలనీ, ఆమెని ఆకర్షించాలనీ, ఆమెతో పరిచయం చేసుకోవాలనీ పరిపరివిధాల ప్రయత్నాలు చేసే కుర్రాళ్ళు చాలామంది వుండేవారు. అటువంటి ప్రయత్నాలు నేనెప్పుడూ చెయ్యలేదు గాని, మల్లీశ్వరంటే లోపల్లోపల నాకూ చాలా యిష్టముండేది. అప్పటికే నాకు ఆప్తమిత్రుడైపోయిన మాధవరావు పదే పదే నా వద్ద మల్లీశ్వరి గురించి ప్రస్తావించడం ప్రారంభించాక, ఆమె పట్ల నాకున్న ఆశలన్నిటినీ అణుచుకున్నాను.

మాధవరావు నాకు మంచి స్నేహితుడే కాదు – నాకంటే అందగాడు. చదువులో, ఆటపాటల్లో నాకంటే తెలివైనవాడు కూడా. అయితే మాధవరావు కూడా మల్లీశ్వరిని ఆకర్షించే ప్రయత్నాలు తనంత తానుగా ఎన్నడూ చెయ్యలేదు. నాకూ, మాధవరావుకీ మల్లీశ్వరి సాన్నిహిత్యం లభించే సందర్భం అనుకోకుండా వచ్చింది.

కాలేజీలో వుండగా నేను నాటకాలు బాగా ఆడేవాణ్ణి. నాకున్నంత ఆసక్తి, అనుభవమూ లేకపోయినా, నా సహవాసదోషం వల్ల మాధవరావు కూడా నాతోపాటు నాటకాలాడ్డం ప్రారంభించాడు. ఆ ఏడాది కళాశాల వార్షికోత్సవసందర్భంగా 'సతీ సావిత్రి' అనే పేరడీ నాటిక ప్రదర్శించాలని నిర్ణయించుకున్నాను. మూడే పాత్రలు – సావిత్రి, సత్యవంతుడు, యముడు. మా కాలేజీలో పనిచేసే లెక్చరరే ఒకాయన రాశాడు. ఆయన అభ్యుదయవాది. పైగా చలంగారికి వీరభక్తుడు. నాటిక మూలకథ పురాణకాలం నాటి సావిత్రి కథే గాని మధ్యలో మారిపోయి, చివరికొచ్చేసరికి అంతా తారుమారైపోతుంది. ఎన్ని అవాంతరాలొచ్చినా లెక్కచెయ్యకుండా, ఎంతదూరమెళ్ళినా విడిచిపెట్టకుండా తన వెంటపడి వేధిస్తున్న సావిత్రి ధైర్యసాహసాలకీ, తెలివితేటలకీ – అన్నిటికీ మించి ఆమె అందానికీ – ముగ్ధుడైపోతాడు యముడు. 'నీ మొగుడు ఏమీ చేతకానివాడు; నీ అత్తమామలు గుడ్డివాళ్ళు; రాజ్యమూ లేదు; సిరిసంపదలూ లేవు; అడవుల్లో కట్టెలు కొట్టుకునీ, కందమూలాలు తినీ బతకాల్సిన కర్మ నీకు లేదు, నాతో

వచ్చావంటే నీకు అమరత్వం ఇప్పిస్తాను. నా పాత పెళ్ళానికి డైవోర్స్ ఇచ్చేసి నిన్ను నా లోకానికి పట్టమహిషిని చేస్తాను... ఆలోచించుకో...' అన్న యముడి మాటలు విని కాస్సేపు ఆలోచించిన సావిత్రి, దున్నపోతెక్కి అతగాడితో లేచిపోతుంది!

యముడిగా నేను, సత్యవంతుడిగా మాధవరావూ నటించాలని ముందే నిర్ణయమైపోయింది. ఇక సావిత్రిగా నటించే అమ్మాయి కావాలి. మా క్లాసులోనూ, కాలేజిలోనూ కూడా ఆడపిల్లల సంఖ్య తక్కువే. ఉన్న కొద్దిమందిలో స్టేజి మీద కెక్కి నాటకాలాడే ఆసక్తి గలవాళ్ళూ, అందులోనూ మగపిల్లల పక్కన నటించే తెగువ వున్నవాళ్ళూ మరీ తక్కువ. మాలో ఎవరి కొచ్చిందోగాని మల్లీశ్వరి చేత సావిత్రి వేషం ఎందుకు వేయించగూడదన్న ఆలోచన వచ్చింది. ఆమె నడగటానికి నేనూ, మాధవరావూ కాస్త జంకినా, నాటిక రాసిన లెక్చరర్ అడగ్గానే వెంటనే వొప్పుకుంది మల్లీశ్వరి.

ఆ ఏడాది వార్షికోత్సవాలలో మా నాటికే హైలైట్ అయింది. ప్రారంభంలో సావిత్రితో కొద్ది డైలాగులూ, ఆ తర్వాత శవంగా పడుకోవటమూ తప్ప సత్యవంతుడి పాత్రకి ప్రాధాన్యం ఏమీ లేదు. మిగతా నాటికంతా సావిత్రి, యమధర్మరాజుల సంవాదమే. నేనూ, మల్లీశ్వరీ అదరగొట్టేశాం. స్టేజి మీద నాకప్పటికే బాగా అనుభవముందిగాని, మొదటిసారి స్టేజి ఎక్కిన మల్లీశ్వరి కూడా అద్భుతంగా నటించింది. ప్రధానపాత్రధారిని, దర్శకుణ్ణి కూడా అయిన నన్నొదిలేసి, సూడెంట్సూ, లెక్చరర్లూ అందరూ మల్లీశ్వరి చుట్టూ చేరి, పొగడ్తలతో ఆమెని ముంచేశారు. ఆడపిల్లలైతే ఆమెని కౌగిలించుకుని ముద్దులు కూఢా పెట్టారు. ఆ పని చెయ్యాలని మగపిల్లలు కూడా ఎగబడ్డారుగాని సాధ్యం కాలేదు. మల్లీశ్వరి చాకచక్యంగా తప్పించుకుని ఎవర్ని ఎక్కడుంచాలో అక్కడుంచింది.

రిహార్సల్స్ ప్రారంభించినప్పట్నించి ప్రదర్శన ముగిసేవరకూ పట్టిన పదిహేను రోజుల్లో మల్లీశ్వరి నాకూ, మాధవరావుకీ స్నేహితురాలైపోయింది. ఆ స్నేహాన్ని ప్రేమగా మలుచుకోడానికి మాధవరావు పలువిధాల ప్రయత్నం చేశాడు. మల్లీశ్వరిని ప్రసన్నం చేసుకోడానికి ప్రతిరోజూ ఏదో ఒక కొత్త మార్గం వెతికేవాడు. కనీసం వారానికోమాటు ఆమె కేదో ఒక విలువైన బహుమతి ఇచ్చేవాడు.

అవుననీ, కాదనీ అనకుండానే, ఆర్నెల్లపాటు అతనితో దాగుడుమూతలాడి చివరికి సరేనంది మల్లీశ్వరి. ఆ తర్వాత కథ కాస్త వేగంగానే నడిచింది. బి.కామ్.

ఫైనల్ పరీక్షలు ముగిసీ ముగియగానే మాధవరావు నన్ను కూడా వెంటబెట్టుకెళ్ళి, మల్లీశ్వరి తండ్రి ముందు తన ప్రేమ ప్రకటించి, ఆమెను పెళ్ళిచేసుకోడానికి అనుమతించవలసిందిగా అభ్యర్థించాడు.

మల్లీశ్వరి తండ్రికి పెద్దగా ఆస్తిపాస్తులేమీ లేవు. ఏదో ప్రయివేటు కంపెనీలో చిన్న వుద్యోగం చేస్తున్నాడు. ఆ టౌన్లో ఒకమూల తాతలనాటి పాత యిల్లొకటి వుంది. ఆయనకి ముగ్గురు కూతుళ్ళు, మల్లీశ్వరి పెద్దది. మగపిల్లల్లేరు. ఇక మాధవరావేమో ఆగర్భశ్రీమంతుడు. అతని తండ్రికి ఆ పట్టణానికి దగ్గర్లో వున్న వూళ్ళో దాదాపు ఎనభై ఎకరాల మాగాణి భూమి, మామిడి తోటలూ వున్నాయి. టౌన్లో వ్యాపారాలున్నాయి. మాధవరావుకి అక్కచెల్లెళ్ళూ, అన్నదమ్ములూ ఎవరూ లేరు. పైగా అందగాడు. అతను పెళ్ళి చేసుకుంటానంటే ఏ ఆడపిల్ల తండ్రయినా ఎగిరి గంతెయ్యాల్సిన పనేగాని, మల్లీశ్వరి తండ్రి మటుకు అంత తేలిగ్గా అంగీకరించలేదు. సవాలక్ష ప్రశ్నలు వేశాడు. ఎన్నో సందేహాలు వెలిబుచ్చాడు. మల్లీశ్వరి ఇంకా పై చదువులు చదివి, మంచి వుద్యోగం సంపాదించి, తనతోపాటు కుటుంబభారం మొయ్యాల్సిన అవసరం వుందన్నాడు. అసలిప్పుడే పెళ్ళి చేసే వుద్దేశ్యం లేదన్నాడు. చెల్లెళ్ళిద్దరి చదువులూ, పెళ్ళిళ్ళూ కూడా మల్లీశ్వరి బాధ్యతేనన్నాడు. ఇప్పుడు పెళ్ళి చెయ్యాలంటే తన దగ్గర పైసా లేదన్నాడు. అన్ని ఖర్చులూ తానే భరిస్తాననీ, పెళ్ళయిన తర్వాత కూడా ఆ కుటుంబానికి అన్ని విధాలా సాయం చేస్తాననీ మాధవరావు హామీ యిచ్చిన తర్వాతగాని, ఆయన మెత్తబడలేదు. ఒక్కగానొక్క కొడుకు కోరిక కాదనలేక మాధవరావు తల్లిదండ్రులు మాత్రం వెంటనే వొప్పుకున్నారు.

ఆ వేసవిలోనే మల్లీశ్వరి, మాధవరావుల పెళ్ళి అట్టహాసంగా జరిగింది.

★★★

అంతకుమించి చదివే వోపిక లేక బి.కామ్.తోనే చదువుకి స్వస్తి చెప్పి, నేనుంటున్న పట్టణంలోనే ఒక ప్రయివేటు కంపెనీలో జూనియర్ ఎకౌంటెంట్‌గా చేరిపోయాను. నాతోపాటే చదువు మానేసినా, ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం లేదు గనక తన తండ్రితో పాటు వ్యాపారాలు నడుపుకోవడం ప్రారంభించాడు మాధవరావు. మల్లీశ్వరితో అతని కాపురం మహా జోరుగా వుంది. అంతకుముందే లంకంత ఇల్లున్నా, కొత్తగా ఒక బిల్డింగ్ కట్టించి కొడుకునీ, కోడల్నీ అందులో వుంచాడు మాధవరావు తండ్రి. కొత్తగా ఒక కారు కూడా కొనిచ్చాడు. షాపింగులు, సినిమాలు,

షికార్లు, పెళ్ళిళ్ళు, పుట్టిన్రోజు పండగలు – ఎక్కడ చూసినా మల్లీశ్వరి, మాధవరావులే కళకళలాడుతూ కనిపించేవారు. రోడ్డు మీద ఎక్కడైనా కనబడితే కారాపి, నన్నూ ఎక్కించుకునేవారు. ఇంటికి తీసుకెళ్ళి మర్యాదలు చేసేవారు. పెళ్ళయ్యేవరకూ నన్ను పేరుపెట్టి పిలిచే మల్లీశ్వరి పెళ్లయిన తర్వాత 'అన్నయ్యా....' అనటం ప్రారంభించింది. 'అదీ మంచిదేలే' అనుకున్నాను. తాళికట్టినవాడిని తప్ప తక్కిన వాళ్ళందర్నీ సోదర భావంతో చూడటం పతివ్రతల లక్షణం గదా అని సరిపెట్టుకున్నాను. కారణాలు నాకు సరిగా తెలీవుగాని, పెళ్ళయిన ఆర్నెల్లకే మాధవరావు ఆ పట్టణం వదిలేసి హైదరాబాద్‌కి మకాం మార్చాడు. అందుకు కారణం మల్లీశ్వరేననీ, ఆమె విలాసాలకీ, వినోదాలకీ ఆ చిన్న టౌన్ సరిపోక మొగుడికేవో మాయమాటలు చెప్పి, కొత్త కలలు చూపించి మకాం మార్పించిందని కొంతమంది అనేవారుగాని ఆ మాటలు నేను నమ్మలేదు.

చూస్తూ చూస్తూ వుండగానే ఏడెనిమిదేళ్ళ గడిచిపోయాయి. నాకూ పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు పుట్టారు. ఒక ప్రమోషనొచ్చి కాస్త జీతమూ పెరిగింది. రెణ్ణెల్లకో మూణ్ణెల్లకో ఒకసారి ఫోన్ చేసేవాడు మాధవరావు. మామూలు కుశలప్రశ్నలు తప్ప మా సంభాషణల్లో పెద్ద విశేషాలేమీ వుండేవి కావు. ఏం చేస్తున్నావనీ, ఏం వ్యాపారమనీ నేనడిగినా సూటిగా సమాధానం చెప్పేవాడు కాదు. పిల్లలు లేరని మటుకు చెప్పాడొకసారి. హైదరాబాద్ రమ్మని ఒకటి రెండుసార్లు ఆహ్వానించాడు గాని, నేనే వెళ్ళలేకపోయాను.

మరో రెండేళ్ళు గడిచాయి. మా కంపెనీ వ్యాపారం బాగా పెరిగింది. హైదరాబాద్‌లో కొత్తగా బ్రాంచి ఆఫీసు తెరిచి, నాకు ప్రమోషనిచ్చి అక్కడికి ట్రాన్స్‌ఫర్ చేశారు. హైదరాబాద్ వెళ్ళిన తర్వాత కూడా ఆఫీసు పనుల్లో తలమునకలుగా వుండి రెండు మూడు మాసాల దాకా మాధవరావుని కలవలేకపోయాను. మధ్యలో కొన్నిసార్లు ఫోన్లో 'హలో' అనటం తప్ప, అతనూ నా దగ్గరకి రాలేదు.

ఒక ఆదివారం నాడు వీలు చూసుకుని నేనే అతని యిల్లు వెతుక్కుంటూ వెళ్ళాను.

అత్యంత అధునాతనంగా నిర్మించిన ఒక హౌసింగ్ కాంప్లెక్స్‌లో దాదాపు రెండు వేల చదరపు అడుగుల విస్తీర్ణంగల త్రీ బెడ్ రూం అపార్ట్‌మెంట్‌లో వుంటున్నారు మల్లీశ్వరి, మాధవరావు. ఆ అపార్ట్‌మెంట్, అందులో ఫర్నిచరూ చూసి నాకు కళ్ళు తిరిగినంత పనైంది. అద్దె నెలకి పాతిక వేల రూపాయలట.

ఆ రోజు మల్లీశ్వరి ఏదో వ్రతం చేసిందట. నేను వెళ్ళేసరికి వ్రతం ముగిసినట్టుంది. మాధవరావు కాళ్ళు కడిగి ఆ నీళ్ళు నెత్తిన చల్లుకుంటోంది. ఆ దృశ్యం చూసి నా వొళ్ళు పులకరించింది. మాధవరావు నా వంక చూసి పలకరింపుగా నవ్వాడు. ఎందుకో గాని ఆ నవ్వులో జీవం లేదు. మల్లీశ్వరి నన్ను చూడగానే సాదరంగా ఆహ్వానించి, కూర్చోబెట్టింది. అదేదో భర్త ఆయురారోగ్యాల కోసం చేసే వ్రతమట.

వ్రతానికొచ్చిన ముత్తయిదువులందరికీ వాయినాలిచ్చి పంపించిన తర్వాత నా దగ్గరకొచ్చి కూర్చుంది. నా క్షేమసమాచారాలన్నీ అడిగి తెలుసుకుంది. నా భార్యనీ, పిల్లల్నీ తీసుకురానందుకు నొచ్చుకుంది. రకరకాల ఫలహారాలు పెట్టి, బలవంతాన నాతో తినిపించింది. దగ్గర దగ్గర పదేళ్ళయి వుంటుంది – అప్పటికి నేనామెను చూసి.

మనిషిలో చాలా మార్పు వచ్చింది. మరింత అందమొచ్చింది. మంచి రంగు తేలింది. బాగా వొళ్ళు చేసింది. పట్టుచీరలో పదిరకాల నగలతో తళతళలాడి పోతోంది. మాధవరావు మటుకు అప్పటికంటే చిక్కాడు. అతనూ ఇంకా రంగు తేలినట్టున్నాడు గాని, అది తెల్లబడటమో, పాలిపోవటమో నా కర్థం కాలేదు. అతనూ నేను వచ్చినందుకు సంతోషించాడు. ఆప్యాయంగా మాట్లాడాడు. కాని ఆ మాటల్లో వెనకటి ఉత్సాహం లేదు. ఆ మొహంలో వెనకటి కళ లేదు. ఎందుకో నా కర్థం కాలేదు.

★★★

ఆ తర్వాత మరికొన్నిమార్లు మాధవరావు యింటి కెళ్ళాను. వెళ్ళిన ప్రతిసారీ ఒక కొత్త మనిషిలా అనిపిస్తోంది మల్లీశ్వరి. కొత్త కొత్త వేషాల్లోనూ కనిపిస్తోంది. చీరలో ఒకసారి, పంజాబీ డ్రెస్సులో ఒకసారి, జీన్స్‌లో ఒకసారి. ఏ వేషంలోనైనా మరింత అందంగా, ఆకర్షణీయంగా – నేను అనకూడదు గానీ – మరింత సెక్సీగా కనిపిస్తోంది. ఈమె వయసు నానాటికీ పెరుగుతోందా, తరుగుతోందా అన్నట్టుగా కనిపిస్తోంది. మాధవరావు మటుకు ఎప్పటికప్పుడు మరింత నిరుత్సాహంగా, నిస్తేజంగా కనిపిస్తున్నాడు. నాబోటి వాడి దగ్గర కూడా నిర్లిప్తంగా వుంటున్నాడు. కారణమేమిటని గట్టిగా అడిగే అవకాశం రాలేదు. అడిగినా పొడిపొడిగా, పొంతన లేకుండా జవాబు చెప్తున్నాడు.

ఒకమాటు అనుకోకుండా మాధవరావు యింటి కెళ్ళాను. అతనుంటున్న ప్రాంతంలోనే మా మేనేజరొకాయన వుంటే, ఆయన్ని కలవడానికెళ్ళి ఎలాగూ

ఇంత దూరం వచ్చాంగదా, మనవాణ్ణి చూసివెళ్దామనుకుని మాధవరావు యింటికి వెళ్ళాను. రాత్రి ఎనిమిదో, ఎనిమిదిన్నరో అయింది. మాధవరావు యింట్లో లేడు. హాల్లో ఏదో పార్టీ జరుగుతున్నట్టుంది. అయిదారుగురు మగాళ్ళూ, మల్లీశ్వరి కాక, మరో ఇద్దరాడవాళ్ళూ వున్నారు. టేబిల్ మీద సీసాలూ, అందరి చేతుల్లోనూ గ్లాసులూ వున్నాయి. గలగలా మాటలు... పకపకా నవ్వులు... సందడి సందడిగా వుంది. నన్ను చూడగానే చటుక్కున లేచి వచ్చింది మల్లీశ్వరి.

'రండి అన్నయ్యగారూ... ఆయన లేరు... వూరి కెళ్ళారు... మా ఫ్రెండ్స్ వచ్చారు... రండి...' అని ఆహ్వానించిందిగాని, మరోసారి వస్తాన్లెమ్మని నేను వెనక్కి తిరిగి వచ్చేశాను.

మరో పర్యాయం పట్టపగలే వెళ్ళాను. పనిపిల్ల తలుపు తీసింది. అప్పుడూ మాధవరావు లేడు. ఎక్కడికో వెళ్ళాడుట.

'అమ్మగారు బెడ్ రూంలో వున్నారు... పిలవమంటారా...>' అంది పనిపిల్ల.

ఏమి చెప్పాలా అని నేను తటపటాయిస్తూ వుండగా, హాలు చివర్లో వున్న మాస్టర్ బెడ్ రూంలోంచి కిలకిలా నవ్వుతూ ఆడగొంతూ, మొరటుగా వున్న మగగొంతూ వినిపించాయి.

ఆ నవ్వు మల్లీశ్వరిదే. నేను గుర్తుపట్టగలను.

పనిపిల్లకేమీ సమాధానం చెప్పకుండానే వెనుదిరిగి వచ్చేశాను.

ఈ సంఘటనకి తోడు నాకూ, మాధవరావుకీ కూడా బాగా తెలిసిన కొందరు కొన్ని కొత్తవిషయాలు చెప్పారు. మాధవరావుకిప్పుడు ఏ వ్యాపారమూ లేదట... అన్ని వ్యవహారాలూ మల్లీశ్వరే నడుపుతోందట... కొందరు ఎమ్మెల్యేలూ, ఎంపీలతోనూ మరికొందరు పురప్రముఖులతోనూ ఆమెకు పరిచయాలున్నాయట... ఆమె కూచోమంటే కూచోటం, నించోమంటే నిలబడటం – మాధవరావు పాత్ర అంతేనట... చివరికి వాళ్ళు తేల్చిందేమిటంటే మల్లీశ్వరి పూర్తిగా చెడిపోయిందని.

కొంత షాక్ తిన్నాను గాని, ఆ మాటలు మటుకు నేను నమ్మలేదు. ఏ మాత్రం సందు దొరికినా ఆడవాళ్ళ మీద అపవాదు వెయ్యటమన్నది, మనవాళ్ళకెప్పుడూ అలవాటే.

'పొద్దున్నే లేవగానే నా పాదాలకి నమస్కరించి, మాంగల్యం కళ్ళ కద్దుకునిగాని మల్లీశ్వరి మంచమ్మీంచి దిగదు...' – అని మాధవరావే లోగడ నాతో చెప్పాడు.

★★★

మల్లీశ్వరి మహాభక్తురాలు.

ఆమె భక్తి ఎంత గొప్పదో వర్ణించడం నాబోటి వాడి వల్ల కాదు. ఆమె ఎంతటి భక్తురాలో, ఆమె భక్తికి ఎంతటి శక్తి వుందో ఎవరూ ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఎందుకంటే ఈ మాటలు రుజువు చేసే నిదర్శనాలు ప్రత్యక్షంగా కనబడుతున్నాయి.

మల్లీశ్వరీ, మాధవరావూ ఇంతకుముందున్న అపార్ట్‌మెంట్ ఖాళీ చేసి మరింత విశాలంగా, విడిగా వున్న ఇంట్లోకి మారారు. ఈ ఇంటి అద్దె నెలకి అరవై వేలట. అపార్ట్‌మెంట్ సరిపోక ఈ ఇల్లు తీసుకున్నారట. నగరానికి కాస్త ఎడంగా అప్పుడే కొత్తగా విస్తరిస్తున్న అందమైన కాలనీ అది. అన్నీ వెయ్యి, రెండు వేల గజాల ప్లాట్లే అన్నీ విడి భవనాలే. మాధవరావు దంపతులు తీసుకున్న కొత్త ఇంటికి కూడా రెండు వేల గజాల స్థలముంది. ఇంట్లో కింద రెండూ, పైన మూడూ బెడ్ రూమ్‌లున్నాయి. కింద పెద్ద హాలూ, వంటింటితోపాటు పూజ కోసం కూడా ప్రత్యేకంగా పెద్ద గది వుంది. అసలా పూజ గది కోసమే ఈ ఇల్లు తీసుకుందట మల్లీశ్వరి. ఆ గదిలో అందరి దేవుళ్ళ పటాలూ అందంగా అమర్చింది. ప్రతి నిత్యమూ ఆమె ప్రత్యేకపూజలతో ధూపదీప నైవేద్యాలతో ఆ గది మాత్రమే కాదు – ఆ భవనమంతా ఒక పూజామందిరంగా మారిపోయింది. ఒక్కో రోజూ ఒక్కో దేవుడి పూజలు, ఒక్కో రకం ప్రార్థనలు – ఎప్పుడూ నేర్చుకుందో ఏమోగాని, మల్లీశ్వరి స్వయంగా మంత్రాలూ, శ్లోకాలూ పఠిస్తోందిట. మధురమైన తన కంఠంతో భక్తిగీతాలూ, భజన్లూ పాడుతోందిట. ఉదయమూ సాయంత్రమూ కూడా ఆమె చేసే పూజలూ, వ్రతాలూ చూడ్డానికీ, ఆమె పాడే భక్తిగీతాలు వినడానికీ, ఇరుగుపొరుగువాళ్లే కాక ఇంకా ఎంతోమంది వస్తున్నారట. వచ్చినవారంతా ఆమె భక్తిపారవశ్యానికి ముగ్ధులౌతున్నారట. వారిలో చాలామంది క్రమక్రమంగా ఆమెకే భక్తులైపోతున్నారట.

మల్లీశ్వరి ఆ యింట్లో అడుగు పెట్టిన దగ్గర్నుంచి అన్నీ అద్భుతాలు జరిగాయట. ఇంటి ముందూ, వెనకా రకరకాల పూల చెట్లున్నాయి. రోజూ తెల్లవారుజామునే లేచి, స్నానాదికాలు ముగించుకుని తోటలోకి వెళ్లి, తనకి కావలసిన పూలన్నీ స్వయంగా కోసి తెచ్చుకుని, పూజామందిరంలో ప్రవేశిస్తుందట మల్లీశ్వరి. అలాంటిది ఒక రోజు

ఆమె తోటలోకి వెళ్ళేసరికి పూల చెట్లన్నీ బోసిగా వున్నాయట. ఎక్కడా ఏ చెట్టుకీ ఒక్క పువ్వు కూడా లేదట! ఇదేమిటా అని ఆశ్చర్యపోతూ, ఈ అనర్థానికి కారణం తనవల్ల ఏమైనా అపచారం జరిగిందా అని మథనపడ్తూ ఆమె పూజామందిరంలోకి వెళ్ళేసరికి – మందిరంలోని ప్రతిదేవతామూర్తి ముందూ అన్ని పువ్వులూ అందంగా అలంకరించి వున్నాయట! ఇటువంటి అనుభవాలే పదేపదే పలుమార్లు కలిగిన మీదట కలవరపడిన మల్లీశ్వరి ఎంతో మహిమగలవాడుగా పేరుగాంచిన ఒక స్వాములవారిని తన యింటి కాహ్వానించి, భక్తజనులందరిముందూ తన అనుభవం ఆయనకు నివేదించి, 'ఎందుకిలా జరుగుతోంది స్వామీ...?' అని ఆందోళనతో అడిగిందట. అప్పుడా స్వామీజీ అర్ధనిమీలితనేత్రాలతో కాస్సేపు ఆలోచించి – 'అమ్మా నువ్వు దైవాంశసంభూతురాలివి... ఇదంతా నీ పూర్వజన్మసుకృతం... నువ్వు పిలిస్తే చాలు ఏ దేవుడైనా పలుకుతాడు... దివి నుంచి భువికి దిగి వస్తాడు... అంతటి మహాభక్తురాలివి నువ్వు...' అని సెలవిచ్చాడట. ఈ మాటలు స్వయంగా స్వామీజీ నోటివెంట విన్నవారంతా అప్పట్నించీ మల్లీశ్వరి భక్తులైపోయారట.

మల్లీశ్వరి ఇంట్లో ఇలాంటివే ఇంకెన్నో అద్భుతాలు జరుగుతున్నట్టు వార్తలు వినబడుతున్నాయి. ఒకనాడు అందరూ చూస్తుండగానే పూజామందిరంలో దీపాలు వాటంతట అవే వెలిగాయట. గంటలు గణగణా మోగాయట. కర్పూరహారతి పరిమళాలు ఇంటి నిండా కమ్ముకున్నాయట. మరొకనాడు మల్లీశ్వరి మీరా భజన్లు పాడుతుండగా పూజామందిరంలో మిగతా విగ్రహాల మధ్యలో వున్న వేణుగోపాలుడి దంతపుబొమ్మ గాలిలో ఎగిరినట్టుగా వచ్చి, ఆమె వొడిలో వాలిందట! ఈ దృశ్యాన్ని కళ్ళారా చూసినవారంతా, సాక్షాత్తూ, ఆ మీరాబాయే మల్లీశ్వరి రూపంలో తమకు సాక్షాత్కారించినట్టు భావించి, ఆమెకు సాష్టాంగప్రణామాలు చేశారట.

వాళ్ళూ, వీళ్ళూ అనుకోవటమే కాదు. క్రమక్రమంగా మల్లీశ్వరి మహిమల గురించిన వార్తలు, ప్రత్యేకకథనాలూ పత్రికల్లోనూ, టివిల్లోనూ కూడా కనబడసాగాయి. ఒక ప్రముఖ టివి ఛానెల్ ఆమె గురించి ఏకంగా గంటన్నర కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం చేసింది. కొన్ని పత్రికలు ఆమె ఫొటోలూ, ఆమె మహత్తును వివరించే విశేషాలూ మొదటి పేజీల్లోనే ప్రముఖంగా ప్రచురించాయి. ఇక మల్లీశ్వరి ఇల్లే ఒక పుణ్యక్షేత్రంగా, ఆమెనే దేవతామూర్తిగా అనుకుంటున్న భక్తజనానికి అంతు లేదు.

అయితే – కళ్ళెదుట కనబడుతున్న వాస్తవాలను కూడా చూడలేనివాళ్ళు కొందరుంటారు. ప్రత్యక్షంగా కనిపిస్తున్నా పరమాత్ముడి లీలలు గ్రహించలేని

అజ్ఞానులు అనేకులుంటారు. అలాంటి వాళ్ళే కొంతమంది మల్లీశ్వరి మహిమలు కానలేక ఆ మహాభక్తురాలి మీద రాళ్ళు విసురుతూనే వున్నారు. మల్లీశ్వరి ఇంట్లో జరుగుతున్న అద్భుతాలన్నీ వట్టి ట్రిక్కులనీ, మేజిక్కులనీ వాగుతున్నారు. అంతటితో ఆగకుండా మల్లీశ్వరి భక్తి అంతా బూటకమనీ, పగటిపూట పరమభక్తురాలిగా కనిపించే ఆమె నిజరూపం అదికాదనీ, రాత్రిపూట ఆమె జరిపే రహస్య కార్యకలాపాలు చాలా వున్నాయనీ పేలుతున్నారు. పగలంతా పరమపవిత్రమైన పూజామందిరంగా కనిపించే మల్లీశ్వరి ఇల్లు రాత్రివేళ పానశాలగా, కామకేళీకలాపాలకు నిలయంగా మారుతుందట. రాజీలు, రాజకీయవ్యూహాలు, రహస్య ఒప్పందాలు, వ్యాపార లావాదేవీలు, నల్లధనం మార్పిడుల వంటి వాటికక్కూడా మల్లీశ్వరి ఇల్లే కేంద్రమట. మల్లీశ్వరి రహస్యసేవలు పొంది, తరించేవారిలో ఎందరో రాజకీయనాయకులు, ఉన్నతాధికారులు, పురప్రముఖులూ వున్నారట. మల్లీశ్వరిని దైవాంశసంభూతురాలిగా ప్రకటించిన స్వాములవారు తరచుగా ఆమె 'సేవ'లు గ్రహిస్తూ, ఆమెను అనుగ్రహిస్తూ వుంటారు. మల్లీశ్వరితో పాటు ఆమె శిష్యురాళ్ళు కొందరూ, నగరంలోని 'హై క్లాస్' లేడీస్ కొందరు కూడా ఈ ప్రత్యేకసేవాకార్యక్రమాల్లో పాల్గొంటూ వుంటారుట. మల్లీశ్వరి శయనమందిరంలో ఒక మంత్రివర్యుడూ, స్వామీజీ 'మధుసేవ'లో వుండగా, మల్లీశ్వరి, మరో మదవతీ అర్ధనగ్నంగా వారికి సహకరిస్తుండగా, ఒక టీవీ ఛానెల్ వాళ్ళు రహస్యంగా అమర్చిన కెమెరాలతో ఆ రాసలీలలన్నీ చిత్రీకరించారట. మంత్రిగారు పది లక్షలిచ్చి ఆ ఛానల్ వాళ్ళని సముదాయించాడట. ఆ తర్వాత ఒక రాత్రి ఆ ఛానల్ అధిపతిని మల్లీశ్వరి కూడా సమాధానపర్చిందట.

ఒకవైపు వేలాదిమంది ప్రజలు మల్లీశ్వరిని ప్రత్యక్షదైవంగా భావించి ఆరాధిస్తూ వుండగా, అటువంటి మహాభక్తురాలిమీద ఇంతటి అభాండాలు ఎలా వేస్తున్నారో, ఇటువంటి దుష్ప్రచారం చేసేవాళ్ళు కళ్ళు పేలిపోకుండా, కాళ్ళూ, చేతులూ పడిపోకుండా ఎలా వున్నాయో నా కర్థం కావటం లేదు. అంతా అయోమయంగా వుంది. మల్లీశ్వరి మహిమ ఎలాంటిదో నేను కళ్ళారా చూశాను. ఒకనాడు ఆమె ఇంటికి వెళ్లేసరికి మల్లీశ్వరి పూజాకార్యక్రమాల్లో నిమగ్నమైవుంది. పద్మాసనం వేసుక్కూర్చుని, చేతులు జోడించి, కళ్ళు మూసుకుని దైవప్రార్థన చేస్తోంది. ఆమె చుట్టూ వున్నవారంతా కూడా చేతులు జోడించి, మంద్రస్వరంతో ఆమె ఆలపిస్తున్న ప్రార్థనాగీతాన్ని పరవశులై వింటున్నారు. అప్పటికి నేను మల్లీశ్వరిని చూసి చాలా

రోజులైంది. పట్టుచీరతో, వొంటి నిండా స్వర్ణాభరణాలతో, నుదుట పెద్ద కుంకుమ బొట్టుతో అపరలక్ష్మీదేవిలా వెలిగిపోతోంది. ఆమె మొహంలో అలౌకికమైన కాంతి ఏదో కనిపించి, అప్రయత్నంగా నేనూ చేతులు జోడించాను. ప్రార్థన ముగిసి మెల్లగా కళ్ళు తెరిచిన మల్లీశ్వరి చూపులు ముందుగా నా వైపే ప్రసరించాయి. నన్ను చూడగానే పలకరింపుగా చిరునవ్వు నవ్వి తన దగ్గరకు రమ్మని సైగ చేసింది. ఆమె చుట్టూ కిక్కిరిసి కూర్చున్న భక్తజనసందోహాన్ని తప్పించుకుంటూ వెళ్ళాను.

'చెయ్యి చాపండి అన్నయ్యగారూ....!' – అంది.

ఎందుకా అని ఆశ్చర్యపోతూ చెయ్యి ముందుకు చాపాను.

మల్లీశ్వరి ఒక్కమారు కళ్ళు మూసుకుని ఏవో మంత్రాలు చదివి, తన కుడి చెయ్యి పైకి లేపి నా చేతికి కాస్త పైగా వుంచి గుప్పిలి మూసి తెరిచింది.

అంతే! అప్పటి వరకూ ఖాళీగా వున్న ఆమె చేతిలోంచి నా చేతిలోకి జలజలా విభూతి రాలింది.

భక్తులంతా హర్షధ్వానాలు చేశారు.

సంభ్రమాశ్చర్యాలతో కాస్సేపు నా నోటి వెంట మాట రాలేదు.

'ఇది సాక్షాతూ ఆ పరమశివుడి ప్రసాదం అన్నయ్యగారూ.... స్వామి మిమ్మల్ని కరుణించాడు. వెళ్ళిరండి...' అంది మల్లీశ్వరి.

నా జన్మ ధన్యమైపోయిందనుకున్నాను. మెల్లగా లేచి వస్తుండగా అక్కడ చేరిన భక్తులు చాలామంది నాకూ నమస్కారాలు పెట్టారు.

హాల్లోంచి బయటకు వచ్చి మాధవరావు కోసం ఎక్కడ వెదికినా కనబడలేదు. అటూ ఇటూ హడావిడిగా తిరుగుతున్న దాసదాసీజనాన్ని అడిగినా, ప్రయోజనం లేకపోయింది.

చివరికొక భక్తురాలు నా అవస్థ గమనించి, ఆ భవనం వెలుపల ఆవరణలో ఒక మూలనున్న ఔట్ హౌస్ వేపు చూపితే అక్కడికి వెళ్ళాను. పాడుబడినట్టుగా పగలే చీకటిగా వున్న ఒక చిన్నగదిలో, మూసిన దుప్పటితో వున్న మంచమ్మీద సిగరెట్టు కాలుస్తూ కూర్చుని వున్నాడు మాధవరావు. మనిషి చిక్కి సగమైపోయాడు. మొహం పీక్కుపోయింది. గడ్డం మాసింది. అక్కడక్కగా నెరిసింది కూడా. ఎన్నో

ఏళ్ళుగా నేనెరిగిన నా స్నేహితుడితడేనా అనిపించేట్టుగా వున్నాడు. నన్ను చూడగానే నిర్జీవంగా ఒక నవ్వు నవ్వి, గోడ కానుకుని వున్న కుర్చీ వేపు చెయ్యి చూపించాడు కూర్చోమన్నట్టుగా.

కుర్చీ అతనికి దగ్గరగా లాగి కూర్చున్నాను. పగలే బాగా తాగినట్టున్నాడు. వాసన గుప్పుమంది. ఎప్పుడైనా సరదాగా స్నేహితులతో కలిసి కాస్త పుచ్చుకోవడం తప్ప అతనికి తాగుడు అలవాటున్నట్టు నాకు తెలీదు.

నేనక్కడ దాదాపు గంట సేపున్నాను. ఎన్నో ప్రశ్నలు అడిగాను.

"పిల్ల జమీందారులా వుండేవాడివి, నీకిదేం కర్మ?" అన్నాను. నగరమంతా మారుమోగిపోతున్న మల్లీశ్వరి మహత్కార్యాల గురించి అడిగాను. ఆమె గురించి వినిపిస్తున్న వదంతుల విషయం కూడా అడిగాను.

నా ప్రశ్నలు వేటికీ సూటిగా సమాధానం చెప్పలేదు మాధవరావు.

ఎంతసేపు కూర్చున్నా అవే పొడి మాటలు. అదే నిర్జీవమైన నవ్వు....

ఇంక చేసేదేమీ లేక లేచివస్తుండగా – 'నీ పిల్లలు బావున్నారా...?' అని అడిగాడు.

సమాధానం చెప్పి బయట కొస్తుండగా, 'ఇంకెప్పుడూ ఇటు వేపు రాకు!' – అన్నాడు.

ఆశ్చర్యంగా తల వెనక్కి తిప్పి అతని వేపు చూశానుగాని 'ఎందుకు?' అని అడగలేకపోయాను.

నాకేమీ అర్థం కాలేదు. అందరు దేవుళ్ళనీ పూజించే పరమభక్తురాలు మల్లీశ్వరి తన పతిదేవుణ్ణి ఎందుకు విస్మరించిందో నాకు తెలియటం లేదు. ఇటువంటి ఐహిక బంధాలూ – స్వపరభేదాలూ నాబోటి సామాన్యులకి గాని, పారమార్థికచింతనే ప్రధానంగా ఎంచుకున్న ఆమె వంటి మహాభక్తులకెందుకుంటాయిలే అని నాకు నేను సర్దిచెప్పుకున్నాను.

★★★

మానవరూపంలో వున్న మహాదేవి మాతాశ్రీ మల్లీశ్వరి.

మల్లీశ్వరిని ఈ మధ్య అందరూ 'మాతాశ్రీ' అనే అంటున్నారు. ఎంత గొప్పవాళ్ళయినా ఆమెనలాగే సంబోధిస్తున్నారు తప్ప ఎవరూ పేరు పెట్టి

పిలవటం లేదు. మీడియా కూడా పదే పదే అదే మాట వాడటంతో ఆమెకా బిరుదు స్థిరపడిపోయింది. ఆమె ఇల్లు 'మాతాశ్రీ ఆశ్రమం'గా మారిపోయింది. రాష్ట్రమంతటా ఆమె మహత్తు గురించి కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. ఆశ్రమానికి వచ్చి ఆమెను దర్శించుకుని, ఆమె చల్లటి చూపుతో, ఆమె ఆశీర్వచనంతో జన్మ తరింపజేసుకునేవారి సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. ఆమె వద్దని వారించినా వినకుండా, భక్తులు తమ శక్తి మేరకు – కొందరు తమ శక్తికి మించి కూడా కానుకలు సమర్పించుకుంటున్నారు. కొందరాడవాళ్ళు వొంటి మీది నగలన్నీ వొలిచి సమర్పించుకుంటున్నారు. క్రమక్రమంగా మాతాశ్రీ ఖ్యాతి దేశవ్యాప్తంగానే కాక విదేశాలకు కూడా విస్తరించింది. కుల, మత, భాషాభేదాలకు అతీతంగా వ్యాపించింది.

ఇంట్లో చోటు చాలదని భవనం వెలుపల ప్రార్థనాసమావేశాలకు ప్రత్యేకంగా ఒక వేదిక నిర్మించారు. ఆ వేదికపై పులి చర్మం పరిచిన ఉన్నతాసనమ్మీద కూచుని ఉదయం మూడు నాలుగు గంటల పాటూ, సాయంత్రం మరో రెండు మూడు గంటలసేపూ మాతాశ్రీ భక్తకోటికి దర్శనమిస్తారు. ఉపదేశాలూ, సందేశాలూ యిస్తారు. ఆమె అనుగ్రహానికి పాత్రులైన మగవారికి బూడిద – క్షమించాలి – విభూతీ, ఆడవారికి పసుపుకుంకుమలూ అప్పటికప్పుడు సృష్టించి మరీ ప్రసాదిస్తారు. ఉదయమూ, సాయంత్రమూ ఎప్పుడు చూసినా ఆమె దర్శనం కోసం భక్తులు బారులు తీరి గంటల కొద్దీ నిరీక్షిస్తున్నారు.

సాయంత్రం ఆరు గంటలు దాటితే మాత్రం ఇంటి గేట్లన్నీ మూసివేస్తారు. మాతాశ్రీ తన అంతఃపురంలోకి నిష్క్రమిస్తారు. ఆ రోజు దర్శనానికి నోచుకోని భక్తులంతా మర్నాడు పొద్దున్నే వచ్చి మళ్ళీ క్యూలో నిలబడతారు. తమకు అత్యంత సన్నిహితులైన అతి కొద్దిమందికీ, ప్రముఖులూ, ప్రసిద్ధులూ అయిన కొందరు భక్తులకీ మాత్రం, మాతాశ్రీ రాత్రివేళ తమ అంతఃపురంలో ప్రత్యేక దర్శనమిస్తారట. అటువంటి 'అర్జితసేవ'లకు అర్హులైనవారిలో రాజకీయ, పారిశ్రామికప్రముఖులూ, సినీ తారలూ, విదేశీభక్తులూ వుంటారట. మాతాశ్రీ మహిమల గురించి విన్న కొందరు అరబ్బీ షేకులూ, సుల్తానులూ కూడా హైదరాబాద్ వచ్చి, స్టార్ హోటళ్ళలో విడిది చేసి, ఆమె ప్రత్యేకదర్శనాల కోసం ప్రయత్నిస్తూ వుంటారట.

మాతాశ్రీగా అవతరించిన మల్లీశ్వరిని మరోమారు దర్శించుకుందామనీ, పనిలో పనిగా మాధవరావుని కూడా చూద్దామనీ ఒక రోజు వెళ్ళాను. సరాసరి

మల్లీశ్వరి వద్దకు వెళ్దామని ప్రయత్నిస్తే ఫలితం లేకపోయింది. ఆమె అనుచరులు, అంగరక్షకులూ నా మాట వినకుండా మెడబట్టి బయటికి నెట్టేశారు. ఇంక చేసేదేమీ లేక, కిలోమీటరు పొడవున్న క్యూలో నిలబడలేక, ఆమె దర్శనభాగ్యం నాకు లేదు కాబోలనుకొని, వెనక్కి తిరిగి వెళ్ళిపోయాను. మాధవరావు దగ్గరకైనా వెళ్ళనిస్తారో లేదో అని ఆ ప్రయత్నం చెయ్యలేదు.

'మాతాశ్రీ నగర్' అన్న పేరుతో నగర శివార్లలో రెండు వందల ఎకరాల స్థలంలో చేపట్టిన ఒక రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుకి ముఖ్యమంత్రి స్వయంగా శంకుస్థాపన చేశారు. ఒక్కొక్కటీ నాలుగు కోట్ల రూపాయల విలువగల విలాసవంతమైన 'విల్లా'లు అక్కడ నూరో, నూట యాభయ్యో నిర్మిస్తారట. శంకుస్థాపన కోసం తవ్వుతున్న గోతిలోంచి మూడు అడుగులు ఎత్తువున్న ఆంజనేయుడి విగ్రహం తన్నుకుంటూ పైకివచ్చింది. ఇంకేముంది? ముఖ్యమంత్రితో సహా అక్కడున్నవారంతా 'జై బజరంగ బలీ!' అనీ, 'జై మాతాశ్రీ!' అనీ జయజయధ్వానాలు చేసి, విగ్రహానికి పూజలు చేశారు. నివాస భవననిర్మాణానికి ముందే అక్కడ ఆంజనేయస్వామి పాలరాతి మందిరం నిర్మించి, మాతాశ్రీ చేత విగ్రహప్రతిష్ఠ చేయిస్తామని ఆ ప్రాజెక్టు నిర్వాహకులు అక్కడికక్కడే ప్రకటించారు. వారం తిరిగే సరికల్లా 'మాతాశ్రీ నగర్' లో నిర్మించబోయే 'విల్లా'లు మూడు వంతులకి పైగా బుక్కయిపోయినట్టు వారే పత్రికలన్నిటిలోనూ ప్రముఖంగా ప్రకటించారు. 'మాతాశ్రీ' పట్ల తమకు గల భక్తితో ఆమె పేరు పెట్టాంగాని, ఈ ప్రాజెక్టుతో ఆమెకేమీ సంబంధం లేదని కూడా వివరించారు. అయినప్పటికీ, ఇదంతా బినామీ వ్యవహారమనీ, ఆ రియల్ ఎస్టేట్ కంపెనీలో సగానికి పైగా షేర్లు మల్లీశ్వరివేననీ కొన్ని పత్రికలు రాశాయి. ఏదో 'సెజ్' పేరుతో ఇటీవలే ప్రభుత్వం నించి అతి చవగ్గా వందలాది ఎకరాలు చేజిక్కించుకున్న మరో కంపెనీ వెనక కూడా మల్లీశ్వరి హస్తమే వుందని మరి కొన్ని వార్తలొచ్చాయి. పదిమంది నోళ్ళలో పేరు నానుతున్నవాళ్ళందరి మీదా ఏదో ఒక విధంగా బురద చల్లటమే పనిగా పెట్టుకున్నవాళ్లు కొందరుంటారు.

ఇటువంటి అపవాదులు ఎన్ని వచ్చినా మాతాశ్రీ కీర్తిప్రతిష్ఠలేమీ చెక్కుచెదరలేదు గాని, ఆ తర్వాత కొద్ది రోజులకే మరో వార్త మీడియా అంతటా మారుమోగిపోయింది. స్టార్ హోటళ్ళలోనూ, ప్రయివేటు గెస్ట్ హౌస్‌ల్లోనూ వున్న విటులకి పడుచుపిల్లల్ని సరఫరా చేసే అతి పెద్ద 'కాల్ గర్ల్ రాకెట్'ని పోలీసులు కనిపెట్టారనీ, ఈ రాకెట్ వెనక నగరంలోని ఒక ప్రముఖవ్యక్తి వున్నట్టు అనుమానిస్తున్నారనీ ఆ వార్త సారాంశం. ఆ ప్రముఖవ్యక్తి మరెవరో కాదు, మల్లీశ్వరేననీ, భక్తురాలి ముసుగులో ఆమె నడుపుతున్న అక్రమ, అనైతిక కార్యకలాపాలు అన్నీ యిన్నీ కాదనీ కొన్ని హేతువాద సంఘాలు

దుమారం లేపాయి. వెంటనే ఆమెనీ, ఆమెకు మద్దతు ఇస్తున్న మరికొందరు పెద్దల్నీ అరెస్టు చేసి ఆమె బండారం బయట పెట్టాలని డిమాండ్ చేశాయి. మల్లీశ్వరి పేరిటా, మాతాశ్రీ ఆశ్రమం పేరిటా జరిగే అక్రమాలన్నిటిలోనూ అధికార పక్షానికి చెందిన నాయకులకీ, ఒకరిద్దరు మంత్రులకీ కూడా భాగస్వామ్యం వుందంటూ, అసెంబ్లీలో కొందరు ప్రతిపక్ష సభ్యులు మరో బాంబు పేల్చారు. సంఖ్యా బలంలో ప్రతిపక్షానికి రెట్టింపు పైగా వున్న అధికారపక్షం వారు ఈ ఆరోపణలన్నీ తిప్పి కొట్టారుగాని, మొత్తమ్మీద ఒకరోజంతా సభలో పెద్ద రగడ జరిగింది.

మల్లీశ్వరిని రేపో మాపో అరెస్టు చెయ్యవచ్చనీ, ఇంతకుముందే అరెస్టు చెయ్యడానికి ప్రయత్నించిన పోలీసు అధికారుల్ని ఆమె అన్నివిధాలా మంచి చేసుకుందనీ కూడా పుకార్లు వినబడుతున్నాయి.

ఇటువంటి దుర్వార్తలన్నీ విని, మాతాశ్రీ భక్తులంతా నిశ్చేష్టులైపోతున్నారు. సాక్షాత్తూ దైవస్వరూపిణి అనదగ్గ ఆ మహాతల్లిపై ఇటువంటి అభాండాలు వేస్తుంటే, ఈ భూమి ఇంకా ఎందుకు బద్దలు కాలేదా, ఈ మిన్ను ఇంకా ఎందుకు విరిగి పడలేదా అని ఆశ్చర్యపడుతున్నారు.

నేనూ అలాగే అనుకున్నాను. కరుణామయి గనుక మాతాశ్రీ మౌనం వహిస్తోంది గాని, ఆమెకే గనక ఆగ్రహం వస్తే ఈ దుష్ప్రచారాలు చేసేవాళ్ళంతా మాడి మసైపోతారు గదా అని కూడా అనుకున్నాను.

భూమి బద్దలు కాలేదు, మిన్ను విరిగి పడలేదుగాని మల్లీశ్వరి ఒకనాటి రాత్రి అకస్మాత్తుగా అదృశ్యమైపోయింది!

ఈ పాపిష్ఠి మానవలోకంలో జరుగుతున్న ఘోరాలు చూడలేక, తన అవతారం చాలించి అంతర్ధానమైపోయిందని ఆమె భక్తులంతా అనుకుంటున్నారు. ఇప్పుడు కాకపోతే మరెప్పటికైనా, మరో రూపంలోనైనా మాతాశ్రీ తమను కరుణించకపోదనే ఆశతో, ఆశ్రమంలో ఆమె ఫొటోలు పెట్టి పూజాపునస్కారాలు కొనసాగిస్తున్నారు.

ఫాతిమా బేగం అనే దొంగ పేరుతో పాస్ పోర్టు సంపాదించి, బురఖా వేసుకుని, దుబాయ్‌లో వేల కోట్ల ఆస్తులున్న షేక్‌తో మల్లీశ్వరి లేచిపోయిందని, కొందరు పాపాత్ములు కొత్త వదంతులు వ్యాపింపజేస్తున్నారు.

O

*రచన మాస పత్రిక, జనవరి 2010*